మీరు మెచ్చే, మీకు నచ్చే, మీరు పాల్గొనే
ఆసక్తికర అంశాల మీ పత్రిక ఇది

# 09. షార్ట్ టర్మ్ కోర్స్

Posted by admin On October 03, 2015 0 Comment




## మొన్న నా షష్టిపూర్తి ఘనంగా జరిగింది.

ఇద్దరు కొడుకులు, కోడళ్లు, ముగ్గురు కూతుళ్లు, అల్లుళ్లు, మనవలూ, మనవరాళ్లూ ఇల్లంతా సందడిగా వుంది.

మోడువారిన చెట్టు ఆకులతో, పుష్పాలతో, ఫలాలతో నిండుదనాన్ని సంతరించుకున్నట్టుగా ఉంది ఇల్లు.. కళ కళ్లాడుతూ.

పిల్లలు బాధ్యతల రెక్కలతో ఎవరికి తోచిన దిక్కుకి వాళ్లు ఎగిరిపోయారు. అందరూ కలవడమన్నది అరుదైపోయింది. ఒకవేళ కలిసినా, వచ్చినప్పటినుండీ చెప్పుల్లో కాళ్లెట్టుకునుండడమే.

నిజానికి షష్టిపూర్తి ఒక మిష మాత్రమే. పెద్ద వాళ్లమైపోతున్నాం. పోయేలోగా అందర్నీ కళ్లారా చూడాలనిపించి, వాళ్లతో కొంత కాలం గడపాలనిపించి ఈ ఏర్పాటు. తప్పించుకునే ఏ కారణాలూ చెప్పి ఎగిరిపోకుండా పదిహేనురోజులపాటు మాతో ఉండాలన్నది మా భార్యాభర్తల షరతు. అలా అయితేనే వాళ్లు చేస్తామన్న షష్టి పూర్తికి అంగీకరిస్తామన్నాం. ఏ కళనున్నారో అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. వచ్చారు.

బంధువులు ఎవరి స్వస్థలాలకి వాళ్లు వెళ్లిపోవడంతో, ఇవాళ్టికి హడావుడి కాస్త నెమ్మదించింది.

“ఏవండీ..మందులేసుకున్నారా?”

“అబ్బబ్బ..వేసుకుంటాను జానకీ..విసిగించకు”

“నాకు తెలుసు మీరిలాంటిదేదో చేసి కొంప ముంచుతారని..రేపు మీకేమన్నా అయితే నేనేంకాను”అంది జాకెట్లోంచి మంగళసూత్రాలు తీసి కళ్లకద్దుకుంటూ.

“మొదలెట్టావూ..తీసుకురా వేసుకుంటా”

“ఇదిగో”అని ఇచ్చింది.

మందుబిల్లలు వేసుకుని ఇన్ని నీళ్లు తాగాను.

పదహారేళ్ల మనవరాలు సువర్చలకి అదంతా విచిత్రంగా వుంది. తమింట్లో అయితే మమ్మీ డాడీ ఇద్దరూ పొద్దున్నవ్వంగానే ఇంటి గూడు వదిలేస్తారు. మళ్లీ ఇంటికి చేరేదెప్పటికో. ఆలోపల ఎవరికి ఒంట్లో బాగోకపోయినా వచ్చి మందేసుకుని వాళ్లరూమ్లో పడుకుంటారు తప్ప, ఇలాంటి సన్నివేశం ఎప్పుడూ చూడలేదు. అందుకే-

“తాతయ్య ఏమన్నా చిన్న పిల్లాడా? నువ్వు మరీ బామ్మా”అంది.

“ఆయన చిన్న పిల్లాడేనమ్మా..”

“నువ్వు మాత్రం చిన్న పిల్లవి కాదేంటి..సమయానికి అన్నం తింటావా? పనుల్లో పడిపోయి ఎన్నిసార్లు మర్చిపోలేదూ..నేను తల్లిలా గుర్తుచేస్తే తప్ప అన్నం

To Read Click Here
వేదిక
To Read Click Here
To Read Click Here
తెలుగువెన్నెల.కామ్
ధర్మానికి, మోహానికి మధ్య...
మనిషి పయనం ఎటు?
చదవండి...
"ప్రేమతో నీ ఋషి ...."
- శ్రీనివాస్ యనమండ్ర
<<Click here >>


తింటావూ.."గింజుకున్నాను.

"ఊర్కోండి..పిల్లలు నవ్వుకుంటారు"అని సిగ్గుపడుతూ లోపలికెళ్లిపోయింది.

"పిల్లలూ పదండ్రా..అలా శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం దాకా వెళ్లొద్దాం"అన్నాను.

అందరూ చక్కగా తయారయ్యారు.

గుడికెళ్లి అయ్యగారికి ముందు నా పేరు, మా ఆవిడ పేరు, పిల్లలు, మనవల గోత్రనామాలు చెప్పి అర్చన చేయమన్నాను.

పంతులుగారు శాస్త్రోక్తంగా పూజ పూర్తి చేసి, తీర్థప్రసాదాలు ఇచ్చాడు.

అందరం గుడి ప్రాంగణంలో ఒక మూలగా కూర్చున్నాం. కొబ్బరిముక్కలు కొట్టి అందరి చేతిలో పెట్టాను.

"తాతయ్యా, మా ఫ్రెండ్ ఫోన్ చేసింది. మాట్లాడేసి వస్తాసే"అంటూ దూరంగా వున్న చెట్టు దగ్గరకి తుర్రుమని పరిగెత్తుకెళ్లింది సువర్చల.

ఫోన్లో నవ్వుతూ, తుళ్లుతూ మాట్లాడ్డం మధ్య మధ్య గమనిస్తూనే వున్నాను. నా వయసుకి ఫోన్లో అవతల వున్నది ఎవరో ఊహించడం పెద్ద కష్టమేం కాదు. అరగంట తర్వాత వచ్చింది ఎర్రగులాబీ రంగు బుగ్గలతో.

"తాతయ్యా, నువ్వు రోజు గుడికి వస్తావా?"అంది ఎనిమిదేళ్ల ప్రభవ.

"సమయం చిక్కినప్పుడల్లా వస్తానర్రా, చాలాసార్లు మీ బామ్మతోటే వస్తాను. అప్పుడప్పుడు ఇలా.. "

"ఎప్పటి నుండీ గుడికొస్తున్నావు తాతయ్యా?"

"మీలాగానే చిన్నప్పటి నుండీరా..కాకపోతే సీరియస్ గా మాత్రం పెళ్లయినప్పటినుండీ"

"అదేం అలా?"

"మీ బామ్మేమో నా క్షేమం కోసం వ్రతాలు, నోములూ ఒక్కటొదలకుండా చేసింది. మరి మొగ వాళ్లం మనకలాంటివి లేవు కదా, అందుకే ఇక్కడికొచ్చి తన పేరు మీద పూజ చేయిస్తా"

"నువ్వు గ్రేట్ తాతా"

"పదండర్రా, చీకటి పడకముందే ఇంటికి చేరదాం. మీ బామ్మకేమో, పిల్లలకి తన చేతులతో వండి పెట్టాలని కోరిక. ఎవరూ వంటింట్లోకి వచ్చి సాయంచెయ్యడానికి ఒప్పుకోదు. అయినా మీ అమ్మలకేమో నాజూకైన వంటిల్లు అలవాటై రుబ్బురోలు, విసుర్రాయి, పెద్ద పెద్ద గిన్నెలతో మా వంటిల్లు చిరాగ్గా వుంటుంది. అందుకని కనీసం కూరలు తరగడంలోనన్నా దానికి కాస్త సాయం చెయ్యాలి. పాపం తనూ పెద్దదైపోయిందికదా"అన్నాను వాళ్లని బయల్దేరదీస్తూ.

"నువ్వు అమ్మమ్మకి వంటలో సాయం చేస్తావా"కళ్లు పెద్దవి చేసి అడిగాడు శ్రీకర్.

"చూడు నాన్నా, వంట అనేది ఆడవాళ్లు మాత్రమే చెయ్యలని  నిర్ణయించింది కాదు. ఒకప్పుడు మగాడు బయటపనులు చక్కబెడితే, ఆడది ఇంట్లో పనులు చూసుకునేది. అది బాధ్యతలు పంచుకోవడం తప్ప, బానిసత్వానికి చిరునామాకాదు."

"మాకైతే ప్రాబ్లం లేదు..ఎందుకంటే పనిమనిషి వచ్చి వండి పెడుతుంది. ఒకవేళ ఆమె రాకపోతే అందరం హోటల్కి వెళ్లి తింటాం"గర్వంగా అన్నాడు సుధీర్.

"వంట తయారు చేయడం..కొసరి కొసరి వడ్డించి తృప్తిగా తినిపించడం. ఇవన్నీ మానవ సంబంధాలు పటిష్టమవడానికే! అందుకే శుభాశుభకార్యాల్లో భోజనానికి అంత ప్రాముఖ్యతనిస్తారు"

"నిజమే తాతయ్యా! హోటల్లు, రెస్టారెంట్లలో తినడమంటే జస్ట్ మెకానికల్గా కడుపు నింపుకోవడమే, ఈసారి నుంచి మా అమ్మ కమ్మగా చేస్తేనే నేను తింటా"అన్నాడు సుధీర్.

"మేమూనూ"అన్నారు మిగతా పిల్లలు.

***

"ఏవండోయ్.."

"ఊఁ"

"ఏవండీ.."

"..వెంటనే సమాధానం చెప్పడానికి నేనేమన్నా కుర్రాడి ననుకున్నావా? నువ్వన్నది నా ముసలి చెవులకి వినపడాలా? సమాధానం చెప్పడానికి కాస్త ఓపికకావాలా?"

"అబ్బో..ముసలితనమేం అడ్డుకాదు..బద్ధకం. ఏంట్లే దానికి సమాధానం చెప్పేదని నిర్లక్ష్యం."

"ఎవరన్నా..కోరి కొరివితో తలగోక్కుంటారా? చెప్పు, ఇంతకీ విషయం ఏంటి"

"ఈరోజు టిఫిన్లోకి ఏం చెయ్యమంటారు?"

"నిన్న పెసలు నానబోశావుగా కమ్మగా ఉల్లిపాయ, మిరపకాయల చిన్న చిన్న ముక్కలు దట్టించి పెసరట్లు వేయి..అన్నట్టు ఉప్మా కూడా చెయ్యి అమోఘంగా ఉంటుంది."

"ఎందుకుండదూ..ఆ వంటింటి పేడీలో మగ్గిపోతూ నేను చేస్తే..లొట్టలేసుకుంటూ తినడమేగా మీ పని"

"అదే మరి..చెప్పమంటావు..చెబితే విసుక్కుంటావు. నీకు ఓపికలేకపోతే జీడిపప్పు ఉప్మా చేయి..నీ చేత్తో అదైనా బాగుంటుందిలే"

"తినాలని ఆశగా అడిగారుగా పెసరట్లే చేస్తాను"అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

***

మధ్యాహ్నం అరిటాకులు వడ్డించి దోసావకాయ, బంగాళదుంపల వేపుడు, అరటిపువ్వు కూర, ముక్కలపులుసు, గుమ్మడి వడియాలు, దబ్బాకు వేసిన మజ్జిగతో అందరూ తృప్తిగా తిని భుక్తాయాసంతో లేచారు.

"అమ్మా, ఎన్నాళ్లయిందే ఇలా తిని. షుగరు, బీ పీ ల బూచులు అస్సలు గుర్తుకురాలేదు" అన్నాడు పెద్ద కొడుకు ఆప్యాయంగా.

"పెర్రినాగన్నా, నేనేం చేసి పెట్టానని. అయినా రోజు జిహ్వకు రుచిగా ఇలాగే తినాల్రా మీరు. తినడానికి భయపడకండి, పిల్లలకీ కడుపునిండా పెట్టండి. బయట తినడం కన్నా ఇంట్లో సుష్టుగా చేసి పెడితే, చేసిన మనకీ, తిన్న వాళ్లకీ ఎంతో తృప్తి"

"నిజమేనే అమ్మా"అన్నాడు.

***

రాత్రి.

చెంబుతో మంచినీళ్లు నా మంచం కింద పెట్టి, నాకు దుప్పటి కప్పింది మా ఆవిడ.

"బామ్మా, తాతయ్యకి నువ్వు దుప్పటి కప్పాలా? ఆయనకి చలేస్తే ఆయనే కప్పుకుంటాడు కదా"అంది సువర్చల.

"ఆయనా..అయ్యో రాత ఆయనకి అంత తెలిస్తే నా రాత ఇలా ఎందుకుంటుందే? ఇప్పుడు ఇలా పడుకుంటాడు. పొద్దున్న లేవంగానే, రాత్రి చలికి జలుబు చేసిందని ఒకటే చిందులేస్తాడు"

"ఏవిటే, నేను పడుకున్నాననుకున్నావా? మనవరాలికి నా మీద పితూరీలు చెబుతున్నావు"

"నాకు తెలియదేమిటీ..మీరు మెలకువగా ఉన్నారని. రేపటినుండన్నా మీరు కప్పుకుంటే, నాకు దుప్పటికప్పే చాకిరీ తప్పుతుందనీ"

"మొగుడికి దుప్పటి కప్పడం కూడా చాకిరనుకునే నువ్వు నాకేం దుప్పటి కప్పక్కర్లేదు"అని విసురుగా దుప్పటి తీసిపడేశాను.

ఒక రాత్రివేళ మా ఆవిడ వచ్చి నాకు దుప్పటి కప్పడం, నిద్రపోతున్నట్టుగా నటిస్తూ సువర్చల చూడడం, నేను గమనించాను.

***

"ఏవే, బాయిలర్లోంచి వేడి నీళ్లు తోడి నీ స్నానానికి బాత్రూమ్లో రోజు నేనే పెడతాగా, మోటగా నువ్వే మోసుకుంటూ నిండు బక్కెట్టి తీసుకెళ్లాలా? నువ్వు కాలుజారి పడిపోతే.."ఆందోళనగా, కోపంగా అన్నాను.

"నా కన్నా మీరే వయసులో పెద్ద. బరువు మోయలేక మీరు మూలన పడితే..వద్దు అలాంటి రోజు రాకూడదు. అశ్వనీ దేవతలుంటారట. భగవంతుడా, వాళ్ళు తథాస్తు అనకూడదు. మీరు నూరేళ్ల పైబడి చల్లగా ఉండాలి. నేను ముత్తైదువగా, మీ చేతుల మీదుగా వెళ్లిపోవాలి"

"మళ్లీ మొదలెట్టావూ, నిన్ను అంత త్వరగా వెళ్లనిస్తానూ..ఒకరు లేకుండా మరొకరం ఉండలేం, మనిద్దరం ఒక్కసారే పైకెళ్లాలి. ఆఁ"

మా ఇద్దరినీ చోద్యంగా చూస్తున్న అందరి హృదయాలూ బరువెక్కాయి.

సువర్చల నా దగ్గరకీ, సుధీర్ మా ఆవిడ దగ్గరకీ వచ్చారు."మీ ఇద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకి అంత ఇష్టమా?"అని అడిగారు.

"చెబుతాను. రోజులు గిర్రున తిరిగి మిమ్మల్ని మా నుండి దూరం చేసే రోజు రేపటికొచ్చేసింది. ఇవాళ భోజనాలు చేశాక మీ అందరితో మనస్ఫూర్తిగా మట్లాడతాను"అని మా ఆవిడ చేతిలోనుండి బక్కెట్టు అందుకుని బాత్రూమ్లో పెట్టాను.

***

భోజనాలు చేసి అందరం విశ్రాంతిగా కూర్చున్నాక- "తాతయ్యా, ఉదయం మేము 'మీ ఇద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకి అంత ఇష్టమా?'అని అడిగాము. నువ్వు భోజనాలు అయ్యాక చెబుతానన్నావు. చెప్పవా?" ఆసక్తిగా అడిగాడు సుధీర్.

"గుర్తుందిరా, మా ఇద్దరి సంబంధం ఇప్పటిదా, కాదు, జన్మ జన్మలది. ప్రేమ పేరుతో ఆకర్షించబడి ఒకరి వెంట ఒకరు పడడాలు, కాదంటే కర్కశంగా చంపేయడాలు అప్పట్లో ఇవేం మాకు తెలియదు. విడాకులు, సహజీవనాలూ అస్సలు తెలియదు. మా వాళ్లూ, వాళ్ల వాళ్లూ కలసి మమ్మల్ని ఒకటి చేశారు. ఆరునెల్లు సావాసం చేస్తేనే వారు, వీరవుతారంటారు..అలాంటిది ఇన్నేళ్ల నుంచీ ఒకరికోసం ఒకరంగా బ్రతుకుతూ మమేకమై వున్నాం. అప్పుడప్పుడూ ఒకరినొకరం కవ్వించి ఉడికించుకుంటూ, అలకలతో, ఎత్తిపొడుపులతో, సరదా మాటలతో దాంపత్య జీవితం మొహంమొత్తకుండా ఆహ్లాదంగా గడిపేస్తున్నాం.

దురదృష్టవశాత్తు ఇప్పటితరంలో బంధాలనుండీ యావ డబ్బు మీదకి మళ్లింది. ధనం సంపాదించుకోవడమే ధ్యేయమైపోతోంది. ఎవరికీ సమయం కేటాయించుకోలేకపోతున్నారు. మా వరకూ మేము జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించాము. మా ఏకత్వ తరువు నుంచీ పుష్పించి, ఫలించిన వాళ్లు మీరు. మామిడి చెట్టు నుండీ మామిడి కాయే వస్తుంది. మల్లె చెట్టుకు మల్లె పువ్వే పూస్తుంది. మేము కోరుకునేది ఒక్కటే సంప్రదాయం అనేది బంధనం కాదు 'ఎప్పుడు తెంచుకు పోదామా?' అని ఎదురుచూడడానికి.

అది మధురమైన బంధం. దాన్ని మనం కాపాడితేనే, దాని చల్లని నీడలో సేదదీరగలం. డబ్బు విలువ తెలియక కోల్పోతే, మళ్లీ సంపాదించుకునే వీలుంటుంది. కానీ జీవితం అలాకాదు. ఒక్క సారి తప్పటడుగు పడితే విలువైన జీవితాన్నే కోల్పోవాల్సి వస్తుంది. మనందరం అతి జాగ్రత్త వహించవలసింది ఈ విషయంలోనే. తల్లిదండ్రులు తమ కోసం సమయం కేటాయించట్లేదని పిల్లలు తప్పుదారి పట్టకూడదు.ఎందుకంటే పెద్దవాళ్ల గుండెకి అది గాయమైనా, దాన్ని కాలం మాన్పుతుంది. కానీ విలువైన జీవితాన్ని కోల్పోయేది పిల్లలే. ఈ మా చెట్టుకి కాచిన కాయలు ఎప్పుడూ ఏ గాలి వానకీ రాలిపడకూడదు. రుచి కూడా మధురంగా ఉండాలి కానీ, వగరుగా, చేదుగా ఉండకూడదు. పళ్లని చూసి తరువుని తల్చుకోవాలి. రేపటి రోజున మేముంటామో, లేదో. రాలిపోయే లోగా ఈ విషయాలు మీతో పంచుకోవాలనుకున్నాం. ఇది సరైన సమయం కూడా"అన్నాను.

"తాతయ్యా, సెల్ ఫోన్లు, ఫేస్ బుక్కు, ట్విట్టర్ ల మాయలో పడి నదినుండీ విడివడబోతున్న పాయల్ని నీ మాటలు, మీ ఇద్దరి అన్యోన్యతా మళ్లీ నదివైపు మళ్లించాయి. పవిత్రమైన నదిలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది" అంది కన్నీళ్లతో సువర్చల.

"నాకు తెలుసమ్మా, వయసు దగ్గరుండి తప్పు చేయిస్తుంది. అప్పుడే మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనకి తాత్కాలిక మైన ఆనందం కాదమ్మా, జీవితకాలపు మధురానుభూతి కావాలి"అన్నాను.

అందరి మనసులూ బరువెక్కాయి.

తన కూతురు తప్పుదారి పట్టబోతోందని తనకన్నా ముందే, నేనెలా తెలుసుకోగలిగానో అర్థం కాలేదు నా పెద్దకొడుక్కి. ‘ఏదేమైనా పెద్దవాడిగా, అనుభవజ్ఞుడిగా నేను తన పరువు బజారున పడకుండా కాపాడాను’ అన్న కృతజ్ఞత వాడికళ్లలో నాకు ప్రస్ఫుటంగా కనిపించింది.

వయసు ఉరకలేస్తుంటే, ఫోన్లలో గంటల తరబడి సరదా సంభాషణలు, సరసాలు సాగిస్తున్నసువర్చలని నేను చాలాసార్లు చూసి తియ్యని మందు వేశానని ఎవరికీ తెలియదు. తెలిసే అవకాశం కూడా లేదు. ఈ పదిహేను రోజులూ మొగుడూ పెళ్లాలు ఎలా ఉండాలి, పిల్లలతో ఎలా గడపాలి, వాళ్ల చుట్టూ ఆత్మీయ కంచె ఎలాకట్టి, జాగ్రత్తగా చూసుకోవాలి, ఇంటి బాధ్యతలు ఎలా పంచుకోవాలి, ఒకరికోసం ఒకరు ఎలా తపించాలి, అసలు కుటుంబమంటే ఎలా ఉండాలి అనే ఆప్యాయతానుబంధాల షార్ట్ టర్మ్ కోర్స్ విజయవంతంగా నిర్వహించాను. భవిష్యత్ తరం మీద ఇప్పుడు నాకు విశ్వాసం కలిగింది.

ఇహ మా బాధ్యత తీరింది. మేము రాలిపోయినా ఫర్వాలేదు.

*****



Comments

Like గోపీకృష్ణమాచార్యులు నల్లాన్ చక్రవర్తుల, Nch Gopimadhavulu and 6 others like this.

